# దీపావళి

ఆ వేళ దీపావళి. ఎందుకో పెందరాళే మెళకువ వచ్చింది. రేడియోలో నాదస్వరం వినబడుతోంది. అక్కడక్కడా చెదురు మదురుగా టపాకాయలు ఉండి ఉండి వినపడుతున్నాయి. ఇంక పక్కమీద ఉండటానికి బుద్ధిపుట్టలేదు. లేచి ముఖం కడుక్కొని ముందరవైపు వరండాలో కూర్చున్నాను.

రాత్రంతా వాన కురిసింది. ఇంటిముందు తోటలో చెట్లన్నీ తడిసి ఉన్నాయి. ఆకులమీద నీటి బిందువులు మంచు ముత్యాల్లా ఉన్నాయి. రోజూ ఏడు గంటలదాకా నిద్రలేవని నాకు ఆ వేళ పెందలాడే నిద్రలేవడం ఎంతో బావుంది. ఇల్లు, తోట ఎంతో ప్రశాంతంగా ఉన్నాయి. మా ఇంటి చుట్టూ చాలా పెద్ద తోట ఉంది. అంచేత అవతలి ఇల్లు, మనుష్యులు మాకు అంతగా కనిపించరు, పెందరాళే లేచి మసక చీకట్లో పచ్చని చెట్లను చూస్తో ప్రశాంతంగా ఏకాంతంగా వేడివేడి కాఫీ త్రాగటం నాకెంతో ఇష్టం. సహజమైన బద్ధకంచేత ఈ అనుభూతి నా కెప్పుడోగాని కలుగదు. రాజమ్మ అప్పుడే పనికి వచ్చింది. కాఫీ తెచ్చి పెడుతుందిగదా అని ఆశతో ఎదురు చూస్తున్నాను.

అంతలో ఆకుల సందుల్లోంచి చెట్ల వెనక ఏదో తెల్లగా మెల్లిగా కదిలినట్లయింది. నా పానకంలో పుడక పడింది. నాకు నిరుత్సాహం కలిగింది. అవతల ఒక మనిషి మనకోసం వచ్చి అక్కడ తారట్లాడుతూ ఉంటే ఇక్కడ మనకు మనస్సు నిశ్చింతగా ఉండదు. ఆ వచ్చింది ఎవరో నాకు తెలుసు. ఎందుకు వచ్చారో కూడా తెలుసు. వారం పది రోజులుగా

పండుగ దగ్గర పడుతున్న కొద్దీ వాడు వస్తాడని ఎదురు చూస్తూనే ఉన్నాను. చివరకు ఇవ్వాళ పొద్దున్నే చీకటితో దర్శనమిచ్చాడు.

రాజమ్మ కాఫీ తెచ్చింది. అది తీసుకొని లోపలికి వెళ్ళిపోయాను. ఇంత అక్కడ ఉండటానికి బుద్ధి పుట్టలేదు. "నారయ్య వచ్చాడు. వాడికి కూడా కొంచెం కాఫీ ఇయ్యి" అని చెప్పాను రాజమ్మతో. పదేళ్లుగా చూస్తున్నాను వాడి బ్రతుకు ఒక్కలాగే ఉంది.

నారయ్య మా పొలం కాపరి. పొలం కాపరి అన్న పేరేగాని, నిజానికి వాడు మాకు చేసేదేమీలేదు. అన్ని పనులు వేరే వాళ్ళెవరో చేస్తారు. వాడికి మేము ఇచ్చేది కూడా అంతగా ఏమీలేదు. ఊరవతల మా పొలాలకు దగ్గరగా కాస్త ఖాళీ స్థలం ఉంటే ఇచ్చాము. అక్కడ ఒక పాక వేసుకున్నాడు ఆ ప్రాంతంలో వాడిది ఒక్కటే పాక. ఆ పాకలోకి ఎండ, వానా స్వేచ్ఛగా వస్తూ పోతూ ఉంటాయి. అయినా అలాగే ఉంటున్నాడు. వాడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక్కకొడుకు. అంతా చిన్న చిన్న పిల్లలు. ఎవరికీ బడికి వెళ్ళే పనిలేదు. చుట్టూ ఉన్న మట్టి, బురద అన్నీ వాళ్ళవే. పొద్దుకూకులు ఆ మట్టిలో పడి ఆడుకుంటూ ఉంటారు. వాడి భార్య మంగమ్మ ఊళ్ళో స్కూల్లో పనిమనిషిగా ఉంది. గదులు ఊడవడానికి. దాని జీతంతో సంసారం గడుస్తోంది.

నారయ్యకి ఏదో లాంఛనప్రాయంగా మేము నెలకి పది రూపాయలిస్తున్నాము. అదీ వాడు మాకు చేస్తున్న పనికోసం కాదు. ఏదో మా పొలాలకు దగ్గరగా ఉన్నాడని. ఏదో మమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నాడని. ఇంకా ఏదో ! కారణాలు నేను చెప్పలేను గాని, ఆ డబ్బు మాత్రం వాడికి ఇస్తున్నాము. వాడికి అదే ఉద్యోగం. అదే నెల జీతం. ఇంకే పనికి పోడు. ఎప్పుడైనా ఎక్కడికైనా రెండు రోజులు ఏదైనా పనికి వెడితే, మూనోరోజు ఆ డబ్బుతో శుభ్రంగా తాగేసి పడుకుంటాడు. ఇంక మరి

కదలదు, మెదలదు. మళ్ళా కొన్నాళ్ళ దాకా ఏ పనికీ పోడు. వాడికి చేతగాని పని ఏదీలేదు. ఎప్పుడైనా అవసరమొచ్చి పిలిస్తే ఏపనైనా సరే చక్కగా చేసి పెడతాడు. అది కొయ్య పని కావచ్చు, గచ్చుపని కావచ్చు తోటపని కావచ్చు. ఇంకేదైనా కావచ్చు. ఎటువంటి పనైనాసరే ఎంతో నేర్పుతో చేస్తాడు. ఎటొచ్చీ ఎవరి దగ్గరా ఏపనీ నిలకడగా చెయ్యడు. మూడురోజులు చేస్తే నాలుగోరోజు నాగా తప్పదు. మరి బుర్ర కుదురుగా ఉండదేమో.

నెలకోసారి మా ఇంటి ముందు ప్రత్యక్షమౌతాడు డబ్బు అడగడానికి. వాడికి మేము లాంఛనంగా ఇచ్చే పది రూపాయలు ఎప్పుడూ ఆరు నెలల జీతం అడ్వాన్సుగా వాడిదగ్గరే ఉంటుంది. అయినా మళ్ళా మళ్ళా వాడికి అవసర మొచ్చినప్పుడల్లా వస్తూనే ఉంటాడు. యాచనకు మాత్రం కాదు. ఎప్పుడూ డబ్బు ఊరికే ఇమ్మని అడగడు. ఎప్పుడూ తన జీతం లెక్కలో కట్టుకుని ఇయ్యమనే అడుగుతుంటాడు. వాడు తీసుకున్న డబ్బు. వాడు నాకింకా ఇవ్వవలసిన డబ్బు అంతా లెక్క సరిగా చెబుతాడు ఏదైనా నేను మర్చిపోయినా వాడు మర్చిపోడు, అడుక్కు తినడం అమర్యాద. ఏదో సంపాదిస్తున్నాను అందులో తీసుకుంటున్నాను అనుకోడం సంతృప్తి.

అందరిలాగే వాడికి ఎన్నో కోరికలు ఉంటాయి ! అవి తీరక, తీరే అవకాశంలేక తాత్కాలికంగా మర్చిపోవడానికి తప్పతాగేసి పడుకుంటాడేమో! వాడికీ అందరిలాగే మంచి ఇల్లు ఉండాలని, తనకూ, తన భార్యకూ మంచి బట్టలు ఉండాలని, అందరి పిల్లలలాగే తన పిల్లలు మంచి డ్రెస్సులు వేసుకుని బడికి వెళ్ళాలని ఉంటుందేమో ! ఇవేవీ వాడు కష్టపడి పని చేసినా తీరే కోరికలు కావు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం నాలుగేళ్ళ కొడుకును చంకన వేసుకుని, భార్యను లాక్కుని మా ఇంటికి వచ్చాడు వాడికి, వాడి భార్యకు వచ్చిన

తగాదాలో నన్ను తీర్పు అడగడానికి ముఖం జేవురించి ఉంది కళ్ళు నిప్పుల్లా ఉన్నాయి. వాడి వాలకం చూస్తేనే తెలుస్తోంది. తప్ప తాగి ఉన్నాడని, లేకపోతే ఎప్పుడూ వాడసలు నా ఎదటపడి నాతో మాట్లాడడు. చాలా భయస్తుడు. అది భయమో గౌరవమో తెలియదు గాని ఎప్పుడూ నాకు దూరంగానే ఉంటాడు.

ఆ వేళ ఆపుకోలేని దుఃఖంతో, బాధతో అన్నాడు భార్యను చూపిస్తూ. "చూడమ్మా, ఇది ఈపూట అన్నంలోకి ఏం చెయ్యలేదు. ఒట్టి గొడ్డు చారు చేసింది." ఆ మాట వింటూంటే నా కడుపులో ఏదో చెయ్యిపెట్టి దేవినట్లనిపించింది. వాడి మనసులో ఏమూలో దాచుకున్న బాధ దానంతటదే బయట పడుతోంది. తిండికోసం ఇంత బాధ! నేను బిత్తరపోయి చూస్తూ నిలుచున్నాను. మంగమ్మ ఏమీ మాట్లాడలేదు. మొగుడి మాటలు వింటూ మొద్దులా నవ్వుతూ నించుంది. ఆ క్షణంలో అది సుఖదుఃఖాల కన్నింటికీ అతీతమైన యోగినిలా ఉంది.

వాడు మళ్ళా అన్నాడు. తన నాలుగేళ్ళ కొడుకుని చూపిస్తూ! "చూడమ్మా! వీడు నా కొక్కగా నొక మగబిడ్డ. వీడు ఒట్టి గొడ్డు చారు అన్నం ఏందుకు తినాలి ?"

అది నారయ్య బాధ. వాడు సరిగా సంపాదించటంలేదని, మంగమ్మ కొచ్చే కొద్ది జీతంతో అంతకన్నా పెట్టలేదని ఆ నిమిషాన వాడి కర్థంకాదు. మళ్ళా మళ్ళా బాధతో, ఆవేశంతో అదే మాట అంటున్నాడు. "నా బిడ్డ ఒక్కగానొక్క మగబిడ్డ, వీడు ఒట్టి చారుమెతుకులు—" మాట పూర్తి కావటంలేదు. కళ్ళు నీళ్ళతో నిండుతున్నాయి. నిజమే! వాడికి ఒక్కడే కొడుకు వాడి బిడ్డ వాడికి గొప్ప. వాడిని గొప్పగా పెంచుకోవాలి. ముద్దుగా పెంచుకోవాలి. మంచి అన్నం పెట్టాలి. మంచి బట్టలు ఇవ్వాలి. వాడు రాజాలా బ్రతకాలి. కాని అది సాధ్యం కాదు. అది కడుపులో రగులుతున్న

బాధ. ఒక్కగా నొక్క కొడుకు. వాడు బారు నీళ్ళే ఎందుకు తాగాలి ? ఈ ప్రశ్నకు నాకూ సమాధానం దొరకదు.

లోపలికి వెళ్ళి రెండు రూపాయలు తెచ్చి మంగమ్మ చేతిలో పెట్టాను. "పప్పూకూరలు అన్నీ తెచ్చి సరిగా వండిపెట్టు" అన్నాను మందలిస్తున్నట్లుగా! "అన్నీ చేస్తుంది పోరా" అన్నాను వాడితో. మైకంలో ఉన్నవాడిని అంతకన్నా ఓదార్చడమెలా ! అంతటితో ఆ రోజుకు వెళ్ళిపోయారు. అయితే అంతటితో ఆ సమస్యలు తీరలేదు.

* * * *

రాజమ్మ మళ్ళా వచ్చి చెప్పింది "నారయ్యకు పది రూపాయలు కావాలిట. పండుగ చేసుకోవాలిట," నాకు తెలుసు, పొద్దున్నే వాడు ఎందుకొచ్చిందీ. పండుగ దగ్గరపడుతున్న కొద్దీ వాడు వస్తాడనే అనుకుంటున్నాను. నారయ్య ఎప్పుడు నా ఎదుటపడడు. ఎప్పుడూ సందులోనో, దొడ్లోనో, చెట్ల దగ్గరో నిల్చుని రాజమ్మ ద్వారానే అడుగుతూ ఉంటాడు. ఇంక ఎంత పొద్దుఅయినా నేను ఇచ్చిందాకా వెళ్ళడు. అల్లాగే మా ఇంటి గోడలు, దొడ్లో చెట్లు పట్టుకు వేళ్లాడుతూ ఉంటాడు. అక్కడే మనిషి నా కంటపడకుండా చుట్టిచుట్టి తిరుగుతూ ఉంటాడు. ఈ సంగతి తెలిసిన నేను వాడిని ఎంతతొందరగా వదిలించుకుంటే అంత మంచిదని, పది రూపాయలు తీసి రాజమ్మ చేతిలో పెట్టాను వాడికివ్వమని. పాపం పండగ కదా ! పిల్లలుగలవాడు పండగ చేసుకోవాలిగదా !

ఈయన ఏదో మీటింగని ఢిల్లీ వెళ్ళి వారం రోజులైంది. వెళ్ళేటప్పుడు చెప్పాను పండగకు తప్పకుండా వచ్చెయ్యమని, ఏదో లాంఛనంగా చెప్పాలిగదా అని చెప్పాను. లేకపోతే ఈ వయసులో ఆయనకూ నాకూ పండగ ఏమిటి ? ఏమి ఆసక్తి ఉంటుంది ! పసిపిల్లలు ఉంటే పండగ చేసుకుంటారు. వెళ్ళేటప్పుడు నేను రమ్మన్నాను, ఆయన వస్తానన్నారు.

కాని మరి పని కాలేదేమో ! ఆయన రాలేదు. ఈ పండక్కి నాకు మరీ అసలు ఆసక్తిలేకుండా ఉంది. అయినా రాజమ్మ నిన్న బజారుకువెళ్ళి కొవ్వొత్తులు, కాసిని పువ్వొత్తులు అన్నీ తెచ్చిపెట్టింది. దానికంతా చాదస్తం! పండగపూట మనసులో ఉత్సాహం ఉన్నా లేకపోయినా విధిగా వీధిలో దీపాలు పెట్టాలి. కాస్త్రానికి రెండయినా టపాకాయలు కాల్చాలి.

సాయంత్రం ఆరు గంటలకు రాజమ్మ ఇంటికి వెళ్ళిపోయింది. పాపం దానికోసం దాని పిల్లలూ, మొగుడూ ఎదురు చూస్తూ ఉంటారు. అదీ ఇంటికి వెళ్ళి పండుగ చేసుకోవాలి. అంకంత ఇంట్లో ఒక్కదాన్ని ఉన్నాను. ఏమీ తోచక వాకిట్లో తోటలో కూర్చున్నాను. దూరంగా ఇళ్ళలో దీపాలు కనపడుతున్నాయి. టపాకాయలు వినపడుతున్నాయి. అలాగే ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను చాలా సేపు.

ఉన్నట్లుండి దీపాలుపోయాయి. ఊరంతా గాఢాంధకారం ఎవరి ఇంటిముందు వారు పెట్టుకొన్న కొవ్వొత్తి దీపాలు మాత్రం కనిపిస్తున్నాయి. ముఖ్యమైన పండుగ రోజుల్లో, ఏదైనా అవసరమైన పని ఉన్నప్పుడూ, హఠాత్తుగా దీపాలు పోతూ ఉండడం మా ఊరి కలవాటు. మా ఇల్లంతా చీకటి మయంగా ఉంది. లేచి ఒక కొవ్వొత్తి వెలిగించడానికి ఓపికలేదు. అంతకన్నా ఆసక్తిలేదు. అలాగే చీకట్లో దిగులుగా కూర్చున్నాను.

హఠాత్తుగా గేటు దగ్గర ఏదో అగ్గిపుల్ల వెలిగించిన కాంతి కనిపించింది. ఏదో అలికిడి వినిపించింది. లేచి మెల్లగా గేటు దగ్గరకు వెళ్ళి చూశాను. నారయ్యా వాడి ముగ్గురు పిల్లలూ చిన్న సీమటపాకాయ వెలిగించటానికి ప్రయత్నిస్తున్నారు. అది వెలగటంలేదు. పిల్లలుదాని చుట్టూ చేరుతున్నారు. నారయ్యా నన్నుచూసి భయపడ్డాడు. నీళ్ళు నములుతూ అన్నాడు, "అయ్యా ఊళ్ళోలేడంటగదా ! ఇల్లు బీసురోమని ఉంటుందని, పిల్లలను తీసుకుని ఈడకే వచ్చాడు పండగపూట టపాకాయలు కాల్సకుంఛా

ఉండకూడదు.” నా మనసు ద్రవించింది. పాపంవాడుకొనుక్కున్న మూడు టపాకాయలు తీసుకుని చీకట్లో పసిపిల్లలను తీసుకుని రెండుమైళ్ళు నడిచి నా ఇంటి ముందు పండగ జరపడానికి వచ్చాడు. వాడు పండగ జరపడానికి వచ్చాడు. వాడు పండక్కి నేనిచ్చిన పది రూపాయల్తో ఏం పండగ చేసుకున్నాడు. ఏం బట్టలు కొనుక్కున్నాడు ? ఏం పిండి వంటలు చేసుకున్నాడు. ఎన్ని టపాకాయలు కొనుక్కున్నాడు. అయినా నా ఇంటి ముందు దీపం వెలగాలని వాడి ఆశ.

తెచ్చిన మూడు టపాకాయల్లో ఒకటి తుస్సుమంది. ఒకటి అసలు వెలగనేలేదు. ఒకటి మాత్రం ఢాం అని పేలింది. అంతటితో పండగ అయిపోయింది.

నారయ్య ముగ్గురు పిల్లల్ని దగ్గరకు తీసుకున్నాడు. “వెళ్ళొస్తాను” అన్నాడు. కాస్సేపు ఆగమన్నాను. లోపలకు వెళ్ళి రాజమ్మ తెచ్చిన టపాకాయలు, కొవ్వొత్తులు ఉన్న బుట్ట తెచ్చి ఆ పిల్లలకిచ్చి వెలిగించమన్నాను. ఆ పిల్లల సంతోషానికి అంతులేదు. అందరూ గంతులు వేశారు. గబగబా కొవ్వొత్తులు వెలిగించి వరుసగా పెట్టారు. మతాబాలు కాల్చి గిరగిరా తిప్పారు వాకిట్లో పండగ కళకళలాడింది.

ఉన్నట్టుండి మళ్ళా ఊరంతా కరంటు వచ్చింది. ఊరంతా మళ్ళా దీపాలు వెలిగాయి. మా ఇంట్లో ఆరిపోయిన దీపాలన్నీ మళ్ళా ఒక్కసారి ఇల్లంతా వెలిగాయి.

*